# "పరదా"


హిందీ మూలం :

**శ్రీ యశపాల్**

తెలుగు అనువాదం :

**కొణిదెన జానకిరామయ్య**


చౌదరి పీర్‌బక్ష్ తాతగారు ప్రభుత్వ ఆదాయ పన్ను విభాగంలో ఇనస్పెక్టరుగా పనిచేసేవారు. ఆయన కొంత సంపాదనతో చిన్నదైనా ఒకగట్టి యిల్లు కట్టించుకున్నారు. పిల్లల్ని బాగా చదివించి అందరిని ఉద్యోగాల్లో చేర్పించారు. అయితే ఆ ఉద్యోగాలేమంత పెద్దవికావు.

చౌదరీ వంశస్థులు తమ వసతి గృహాన్ని 'హవేలీ' అని పిలుచుకుంటుండేవారు. ఇంటి పేరు హవేలీ అయినా యిల్లు యిరుకుగానే యుండేది. పీర్‌బక్ష్ తాత నాటి కాలం నుంచి యింటి వాకిలికి "పరదా" యుండేది. ఆ పరదా గుడ్డకూడా చాల ఖరీదైనదిగా యుండేది. పీర్ బక్ష్ తండ్రుల సమయంలో అంతా కలిసియుండేవారు. అప్పుడు "పరదాగుడ్డ ఎవరు కొనితేవాలా? అనే సమస్య వచ్చింది." చివరకు ఇనస్పెక్టర్‌గారి విలువయిన రంగు రంగుల దుప్పట్లన్నీ ఆ సమస్యను పరిష్కరించాయి.

"పీర్‌బక్ష్" తరంలో నలుగురన్నదమ్ములకు పెండ్లిండ్లు అయినాయి. యిల్లు చిన్నదైనందున అందరికి చాలలేదు. పీర్‌బక్ష్ అన్నలు ముగ్గురూ వేరే యిళ్ళు అద్దెలకు తీసుకుని వెళ్ళిపోయారు.

పీర్‌బక్ష్ నాలుగోవాడు. అతనికి చదువబ్బలేదు. ఆర్థిక యిబ్బందుల వలన పెద్దగా చదవలేకపోయినాడు. అయితే పెళ్ళి అయింది.

"అల్లా దయ" వలన పీర్‌బక్ష్ భార్య "ఎడుపు త్వరలో పండింది" వంశ ప్రతిష్ఠను నిలబెట్టడానికి పీర్‌బక్ష్ రోజువారీ వేతనం మీద ఒక నూనె మిల్లులో గుమస్తాగా కుదిరాడు. చదువు ఎక్కువగా లేకపోయినా, తెల్ల దుస్తులు వేసుకుని తిరిగే వంశ మర్యాద కావల్సినంత యున్నది. "కూలీ నాలీ వృత్తి ఆయన చెయ్యతగినదికాదు, కుర్చీలో కూర్చొని, కలం, సిరాబుడ్డితో మాత్రమే పనిచెయ్యాలి.

"పీర్‌బక్ష్‌కు నెలకు పన్నెండు రూపాయలు జీతం వచ్చేది. ఊరి చివరలో పాటక జనం ఉండే పేటలో రెండు రూపాయిల అద్దెకు ఒక యిల్లు తీసుకున్నాడు: బజారులోనున్న పంపునీరు ఆయనున్న యిరుకు సందులో ప్రవహిస్తుండేది. ఆ కాలవ ప్రక్కన మొలచిన గడ్డిలో నుంచి లేచిన ఈగలు, దోమలు, పగలూ రాత్రి తమ నృత్య గానాలను ప్రదర్శిస్తుండేవి. పీర్‌బక్ష్ యింటి కెదురుగా ఒక చాకలిబట్టి యున్నది. అందులో నుంచి పొగ, సోడాయుప్పు వాసనా వస్తుంటాయి. యింటికి ఒకవైపు చెప్పులు కుట్టేవారు, మరో వైపు వర్క్‌షాప్‌లో పనిచేసే కూలీలు యున్నారు.

ఆ పేట మొత్తంలో చదువుకున్నవాడు, తెల్లబట్టలు వేసుకునే వాడు "చౌదరీ పీర్‌బక్ష్" ఒక్కడే! అతని ఇంటి వాకిలికి మాత్రమే పరదా! యుండేది. పేటలోని వారంతా ఆయన్ని "చౌదరీజీ" అని, "మున్షీజీ" అని పిలుస్తుండేవారు. నమస్కారాలు చేస్తుండేవారు. "పీర్‌బక్ష్" ఇంట్లోని ఆడవారు ఎప్పుడూ బయటికి కనుపించేవారు కారు. 4, 5 ఏండ్లు వయసు వచ్చేవరకూ ఆడపిల్లలు మాత్రం బయటికి వచ్చేవారు. పొద్దున, సాయంత్రం పీర్‌బక్ష్ నవ్వుతూ వచ్చి పంపువద్ద నీరు పట్టుకుపోతుండేవాడు.

చౌదరీ జీతం పదిహేను సంవత్సరాలలో 12 నుంచి 18 రూపాయలదాకా పెరిగింది. ధన రూపంలో కాకపోయినా సంతాన రూపంలో పీర్‌బక్ష్‌పట్ల 'అల్లా' అధిక దయ చూపించాడు: చౌదరీజీకి 15 ఏండ్లలో మొదట ముగ్గురు ఆడపిల్లలూ, తరువాత ముగ్గురు మొగపిల్లలూ కలిగారు.

రెండో పురుడు పోయడానికి సాయంగా వచ్చిన 'తల్లి' అతని దగ్గరే ఉండిపోయింది. పీర్‌బక్ష్ తండ్రి చనిపోయిన తర్వాత, అతని అన్నలెవరూ ఆమెను పట్టించుకోలేదు, పిల్లా జెల్లా యున్న యింట్లో తెల్లవారిలేస్తే అనేక యిబ్బందులు వస్తుంటాయి. పిల్లలకో, తల్లికో ఏదో 'సుస్తి' చేస్తూనే యుంటుంది. అటువంటప్పుడు ఎక్కడో అక్కడ అప్పు చెయ్యక తప్పదు. అసలు అప్పుచెయ్యకుండా జరుపుగల పేద కాపురాలెన్నుంటాయి?

మిల్లువారు ప్రతినెలా ఏడో తారీకు తప్పనిసరిగా జీతం యిస్తారు. మిల్లు యజమానికి 'అడ్వాన్సులు' యివ్వడమంటే పరమ

అసహ్యం, అత్యవసరమయితే తప్ప జాలితలచేవాడుకాడు. అందు వలన పీర్‌బక్ష్ యజమానిని అడ్వాన్సు అడిగేవాడుకాదు. యింట్లో వున్న ఏదో ఒక వస్తువును తాకట్టుపెట్టి అప్పుతెస్తుండేవాడు. తాకట్టు పెట్టిన వస్తువుకు రూపాయికి ముప్పావలా మాత్రమే యిచ్చేవారు. వడ్డీ కింద పావలా మినహాయించుకునేవారు. అయితే తాకట్టు పెట్టిన ఆ వస్తువు తిరిగి యిల్లు చేరేదికాదు.

ఆ పేటలో పీర్‌బక్ష్‌కు మంచి గౌరవం వుండేది. ఆ గౌరవానికి కారణం ఆయన యింటికి 'పరదా' వుండడమే - లోపల ఎలా యున్నా బయట పరదా సలక్షణంగాయుండేది. అప్పుడప్పుడు పిల్లలు యిటూ అటూ లాగడం వలన జాలిలేని గాలి తాకిళ్ళ వలన చిరిగిపోతుండేది. వెంటనే లోపల్నించి రెండు చేతులు బయటికివచ్చి 'పరదా'ను మరమ్మత్తు చేస్తూండేవి.

బయటి వాకిలి తలుపులు పాతవయిపోయి స్థాన భ్రంశాన్ని చెందాయి. అనేకసార్లు సర్ది పెట్టినందున దర్వాజాలోనుంచి సొంతం విడిపోయినాయి. యింటి 'ఖామందు' వాటిని పట్టించుకోడు. ఎప్పుడైనా తలుపులు బాగుచేయించమని పీర్‌బక్ష్ అడిగితే మీరిచ్చే ముష్టి రెండు రూపాయలకు యింటికి మరమత్తులు కూడానా? పైగా ఆ అద్దె కూడా ఆరు నెలలకొకసారి యిస్తారు. కలప ఖరీదెంతయుందో తెలుసా? మీకిష్టం లేకపోతే ఇల్లు ఖాళీ చెయ్యండి" అనేవాడు-చివరకు వాకిలి తలుపులు సొంతం పడిపోయినవి. రాత్రుళ్ళు పీర్‌బక్ష్ ఎలాగో శ్రమపడి వాటిని వాకిలికి అడ్డంపెట్టేవాడు. దొంగలు చొరబడతారేమోనని తెల్లవారులు నిద్రపోయేవాడు కాదు.

పీర్‌బక్ష్ తెల్లగుడ్డలేసుకు తిరిగినా, ఆ పేటలో ఆయనకు మంచి గౌరవమున్నా దొంగిలించటానికి మాత్రం ఆ యింట్లో ఏమీ దొరకదు. దొంగిలించడానికి పనికి వచ్చే పాత్రలుగాని, బట్టలుగాని ఆ యింట్లో ఏమీలేవు - అయినా దొంగ దొంగేకదా? భయం తప్పదు.

దొంగ భయం కంటే కూడ గౌరవ మర్యాదలు పోతాయేమోననే భయం అధికంగా యుండేది. ఆ యింటి మర్యాదను కాపాడుతున్నది బయటి వాకిలికి కట్టియున్న 'పరదా' యొక్కటే. అది కూడా చినిగి పోగులు పోగులయినది. ఒక రోజు రాత్రి పెద్దగాలి కొట్టే వరకు సొంతం పనికిరాకుండా పోయింది. మరుసటిరోజు తెల్లవారేవరకు ఎన్నో తరాల నుంచి సురక్షితంగాయున్న ఒకే ఒక దుప్పటి పరదాగా తయారైంది. ఇంటి కెదురుగానున్న వారు అది చూసి "చౌదరీజీ ఈ కరువు రోజుల్లో అంత మంచి దుప్పటిని ఎందుకు పాడుచేస్తారు ఒక గోనెపట్టా కొనుక్కొచ్చి వాకిలికి కట్టండి" అన్నారు. లోగడే పీర్‌బక్ష్‌కి ఆ ఆలోచన నచ్చింది. కాని రెండు గజాల పట్టా అర్ధ రూపాయి చెప్పారు. అందుకని పీర్‌బక్ష్ నవ్వుతూ, "పోనిద్దురూ మా 'హవేలీ'లకు పరదాలుగా ఎప్పుడూ దుప్పట్లే వాడుతుంటాం" అన్నాడు.

బట్టల ధర ఆకాశాన్నంటుతున్న ఆ రోజుల్లో యింట్లోనున్న అయిదుగురు స్త్రీల వస్త్రాలు పేలికలు, పేలికలు అయిపోయినాయి. పీర్‌బక్ష్‌కు వచ్చే జీతం యింట్లో వారందరికి రోజుకు ఒక్కపూట కడుపునింపుకోడానికే చాలదు. యిక బట్టలు కూడా ఎక్కడ కొంటారు? అయితే 'పీర్‌బక్ష్' ఉద్యోగానికి పోవాల్సినవాడు గనుక అతనికి తప్పనిసరిగా దుస్తులుకావాలి. ఉన్న ఒక జత పైజమా, లాల్చీ కుట్టడానికి వీలులేనంతగా చినిగిపోయినాయి. కోరా గుడ్డతో నన్నా ఒక పైజమా లాల్చీ కుట్టించుకోవాలనుకున్నాడు. కాని అశక్తుడై పోయినాడు.

తాకట్టు పెట్టడానికి ఇంట్లో వస్తువులేమీ లేనప్పుడు నిరుపేదలకు "పంజాబ్ ఖాన్" శరణ్యం. ఏ ఇంట్లో అయినాసరే, ఇంట్లో వుండేవారందరికీ 'ఖాన్' అప్పులిస్తాడు-పది నెలల క్రితం 'బరకత్' పుట్టినప్పుడు 'బక్ష్'కు డబ్బు అవసరమైంది, ఎక్కడా అప్పు దొరకలేదు, పంజాబ్ ఖాన్ "బబర్ అలీఖాన్" వద్ద నాలుగు రూపాయలు అప్పుతీసుకున్నాడు. ఖాన్ వడ్డీ వ్యాపారం ఆ పేటలో నిరాటంకంగా జరుగుతుంటుంది. మోట్‌లు, చాకళ్ళు, వర్క్‌షాప్ కూలీలు అతని వద్ద అప్పులు తీసుకుంటుంటారు. వాయిదాల పద్ధతిలో అప్పు చెల్లించలేనివారి వాకిలి తలుపులమీద 'బబర్ మియా' లాఠీ కర్రతో బాదడం 'బక్ష్' అనేక సార్లు చూసాడు' బాకీ వాళ్ళు. బబర్‌మియాల మధ్య అనేకసార్లు మధ్యవర్తిత్వం కూడా చేసాడు. పీర్‌బక్ష్, 'బబర్'ను 'సైతాను' అంటుండేవాడు. అయితే గత్యంతరంలేక ఆ బబర్‌నే ఆశ్రయించాల్సి వచ్చింది. నెలకు రూపాయికి నాలుగణాల వడ్డీ చొప్పున నాలుగు రూపాయలు అప్పు తీసుకున్నాడు. బబర్, పీర్‌బక్ష్ నిజాయితీగల వంశంలోనివాడు. ముస్లిం సోదరుడయినందున నెలకొక్క రూపాయి చొప్పున చెల్లించేటట్లు. ఎనిమిది నెలలలో అప్పుమొత్తం చెల్లించేటట్లుగా షరతు పెట్టాడు.

ఖాన్‌కు వాయిదా ప్రకారం డబ్బు చెల్లించలేకపోతే అతను వచ్చి తన యింటి ముందుచేసే బీభత్సం తలుచుకున్నప్పుడు పీర్‌బక్ష్‌కు ముచ్చెమటలు పోసేవి. ఉపవాసాలుంటూ ఏదో విధంగా ఏడు నెలలపాటు వాయిదాలు చెల్లించాడు. కాని శ్రావణంలో వానలు వెనుక పట్టినప్పుడు జొన్నలు కూడా రూపాయికి మూడు సేర్లు అమ్మాయి. అందుకని ఆ నెలలో వాయిదా చెల్లించలేక పోయినాడు.

ఏడవ తారీఖు సాయంత్రం ఖాన్, పీర్‌బక్ష్ యింటిముందు ప్రత్యక్షమైనాడు. పీర్‌బక్ష్ ఖాన్ గడ్డం పట్టుకుని అల్లామీద ఒట్టుపెట్టి వచ్చే నెలలో తప్పకుండా యిస్తానని బతిమాలి పంపించాడు.

భాద్రపదంలో పరిస్థితి యింకా భయంకరంగా తయారైంది. పీర్‌బక్ష్ భార్య ఆరోగ్యం రోజు రోజుకు దిగజారసాగింది. ఏం తిన్నా యిమడడంలేదు. ఆమెకు గోధుమ రొట్టెలు పెట్టక తప్పడం లేదు. అతి కష్టంమీదన గోధుమలు రూపాయికి రెండున్నర సేర్లు దొరికేవి. పథ్యం కోసం అప్పుడప్పుడు, ధనియాలు, వెల్లుల్లి, సోంపు, వాము, కొనాల్సివచ్చేది. పావలా పెడితేగాని ఏ వస్తువు వచ్చేదికాదు. ఆ నెల్లో చౌదరికి కరువు బత్తెం క్రింద రెండు రూపాయలు ఎక్కువగా యిచ్చారు. అయినా, అడ్వాన్సు తీసుకున్నది పోను చేతికి నాలుగు రూపాయిలొచ్చాయి.

దాదాపు పోయిన నెలంతా పిల్లలూ పస్తులతోనే గడిపారు. రోజుకొకసారి జొన్నగంజి కాచుకొని తలా ఒక గ్లాసు తాగేవారు. అతి కష్టంమీద నెలాఖరులో దొరకిన నాలుగు రూపాయలు జీతంలో ఖాన్‌కు రూపాయి పావలా యివ్వడానికి బక్ష్ ధైర్యం చెయ్యలేక పోయినాడు. జీతం తీసుకుని పైన భగవంతుడంతా చూస్తునే యున్నాడు, మేలు చెయ్యక పోడ"నుకుంటూ" పీర్‌బక్ష్ మిల్లు నుంచి నేరుగా బజారుకు బయలుదేరాడు. రెండు గంటల తర్వాత ఖాన్ యింటికి వచ్చి వెళ్ళిపోయుంటాడని గట్టిగా నిశ్చయించుకుని, బిచ్చం మూట వేసుకుని యింటికి బయలుదేరాడు. కాని గుండెల్లో రైళ్ళు పరుగెడుతూనే యున్నవి. ఆకలితో అలమటిస్తున్న నలుగురు పిల్లలూ, తల్లి, పాలుచాలక బక్క చిక్కిపోయిన చంటిది, మంచంలో పడి కృశించి చావుకోసం ఎదురు చూస్తున్న తన తల్లి యింకా కలవరపెట్టసాగారు. అయినా 'అల్లా'ను తలుచుకుంటూ యింటికి చేరాడు.

ఏదో తారీఖు 'బక్ష్'ను కలుసుకోలేకపోయిన 'ఖాన్' ఎనిమిదో తారీకు ఉదయం సూర్యోదయానికి ముందే 'బక్ష్' మిల్లుకు పోక ముందే చేతిలో లాఠీ పట్టుకుని యింటిముందు ప్రత్యక్షమైనాడు.

తెల్లవార్లు ఆలోచించి ఖాన్‌కు సర్దిచెప్పడానికి బక్ష్ ఒక పథకం తయారు చేసుకున్నాడు. మిల్లు యజమాని ఊరికిపోయినాడు. నాలుగు రోజులదాకా రాడు. అతని సంతకం లేనిదే జీతం యివ్వరు. కనుక జీతం యివ్వగానే ఆరు రూపాయలు యిచ్చుకుంటాను అని వినయంగా దీనంగా చెప్పాడు. తగిన కారణం చెప్పినా ఖాన్ చాల సేపటిదాకా గమనిస్తూనే యున్నాడు. "మేము స్వదేశం వదులుకుని యిక్కడ పడియున్నాం, మాకూ పెళ్ళాం బిడ్డలున్నారు. మీకు అప్పులు పెట్టిన డబ్బును వదులుకొని పోవడానికి మేమిక్కడకు రాలేదు. నాలుగు రోజుల్లో డబ్బు యివ్వకపోతే నీ సంగతి తేలుస్తాను." అంటూ వెళ్ళిపోయినాడు.

అయితే అయిదో రోజుకల్లా డబ్బు ఎక్కడ నుంచి వస్తుంది? జీతం వచ్చి వారంకూడా కాలేదు. మిల్లు యజమాని అడ్వాన్సు యివ్వనని గట్టిగా చెప్పాడు. అదృష్టవశాత్తు ఆరోజు ఆదివారం అయింది. మిల్లుకి సెలవయినా పీర్‌బక్ష్, ఖాన్ వస్తాడనే భయంతో తెల్లవారుఝామునే బయటికి వెళ్ళిపోయినాడు. తెలిసిన వాళ్ళను, ముఖ పరిచయమున్న వాళ్ళను "ఒక్క రూపాయి పావలా యుంటే యివ్వండి, రెండు రోజుల్లో తిరిగి యిస్తానంటూ" అడిగాడు.

మియా, అప్పులు పెట్టడానికి మా వద్ద డబ్బులు మిగులుతున్నాయా? జీతం వచ్చీరాకముందే అప్పులవాళ్ళు గద్దల్లా వచ్చి తన్నుకు పోతున్నారు." అన్నారు వాళ్ళు.

రెండు జాములు దాటింది, 'ఖాన్ వచ్చినా యింతసేపుండడులే' అనుకుంటూ యింటి ముఖం పట్టాడు. బక్ష్ యింటికి చేరగానే ఖాన్ వచ్చాడని, రెండు గంటలసేపు లాఠీతో 'పరదాను' కొడుతూ, పిచ్చితిట్లు తిట్టాడని. 'మీకు డబ్బుతెచ్చి యివ్వడానికి ఆయన బయటికి వెళ్ళారని ఎంత చెప్పినా నమ్మక ఎక్కడికి పోలేదు ఆ నీచుడు, దొంగా, యింట్లోనే నక్కియున్నాడని, మళ్ళీ నాలుగు గంటలకు వస్తానని అప్పుడు కూడా నాడబ్బివ్వకపోతే వాడి తోలు వలిచి బజార్లో అమ్ముతానని" అంటూ వెళ్ళిపోయాడని భార్య చెప్పింది.

నాలుగింటికి ముందే "చౌదరీ!" అనే ఖాన్ కేక వినుపించింది. పీర్‌బక్ష్‌కు "కరెంట్ షాక్" తగిలినట్లయినది. కాళ్ళు చేతులు చచ్చుపడ్డాయి. ఖాన్ పరదాను లాఠీతో బాదుతూ బక్ష్‌ను తిట్టుతున్నాడు. ఆ తిట్లువింటూ బక్ష్ నిర్జీవ ప్రాయుడైనాడు. కాని నిచ్చేష్టుడుకాలేదు. నెమ్మదిగా బయటకి వెళ్ళాడు. ఖాన్ భగ్గుమన్నాడు. "డబ్బు యివ్వలేక దాక్కున్నావా? అంటూ పీర్‌బక్ష్ తాత తండ్రులకు తగిలి వచ్చేటట్లు అసహ్యమైన తిట్లు తిట్టాడు. భయంకరమైన యీ తిట్లు వింటే కోపంతో పొంగిపోవాల్సిన బక్ష్ నెత్తురు మంచులా చల్లపడి పోయింది. ఖాన్ ముందు మోకాళ్ళమీద కూర్చుని తన కష్టాలను విన్న వించుకుంటూ యింకొంచెం గడువిమ్మని ముఖస్తుతి చేయసాగాడు.

పీర్‌బక్ష్ బతిమాలాడుచున్న కొద్దీ ఖాన్ ప్రతాపం అధికమయింది. ఖాన్ మండిపడి లాఠీ నేలమీద కొడుతూ "అంత తీర్చలేని వాడివి అప్పు ఎందుకు తీసుకున్నావు? నీ జీతం ఏమైంది ఉష్ట్రవుడి

యంగా నా డబ్బు కాజేస్తావా? నీ తోలు తీస్తాను. డబ్బులేకపోతే వాకిలికి పరదా తగిలించికుని దర్జా ఎలా వెలగ పెడుతున్నావ్? నీ పెళ్ళాం నగలన్నాయియ్యి. యింట్లో యున్న చెంబూతప్పాలన్నా యియ్యి - లేకపోతే యివాళ నిన్ను వదలను" అన్నాడు.

పీర్‌బక్ష్ సొంతం వివశుడై రెండు చేతులు పైకెత్తి అల్లా మీద వట్టుపెట్టుకుంటూ, భాయీ, "యింట్లో ఒక్క పైసాలేదు- చిల్లి తప్పాలాలు, చింకిపాతలు కూడా ఏమీలేవు - ఇదిగో నా చర్మం మీ కిష్టమైతే వలిచి తీసుకుపోయ్యి బజార్లో అమ్ముకోండి!" అన్నాడు.

ఖాన్ కోపం ఆకాశాన్నంటింది - "నీ చర్మం నాకెందుకు? చెప్పులు కుట్టడానికి కూడా పనికిరాదు. నీ తోలుకంటే యీ 'గోనె పట్టా'యే మంచిది" అంటూ వాకిలికి అడ్డంగాయున్న 'పరదా'ను ఒక్క ఊపులో లాగేశాడు - వాకిలికి కట్టిన పరదా తెగి కిందపడగానే పీర్‌బక్ష్ జీవనసూత్రం తెగిపోయినట్లయింది. బక్ష్ ఆపాదమస్తకం వణికిపోతూ కింద పడిపోయాడు.

ఆ దృశ్యాన్ని చూసే శక్తి పీర్‌బక్ష్‌కు లేకపోయింది. కాని వాకిట్లో పోగైన గుంపు చూసింది - యింట్లోయున్న ఆడపిల్లలు, స్త్రీలు పరదాకు ఆవలివైపు జరుగుచున్న బీభత్సానికి భయపడుతూ అందరూ యింటి మధ్యకుచేరి వణుకుతూ నిలబడియున్నారు. ఆ పరదాయే యింట్లోవున్న స్త్రీలందరికీ ఏకైక వస్త్రం-హఠాత్తుగా పరదా తొలగిపోగానే వాళ్ళంతా తమ వంటిమీద గుడ్డలు లాగేసినట్లుగా ముడుచుకు పోయారు. వారి శరీరాలమీదున్న చింకి పాతలు వారి శరీరాల్లో మూడో వంతును కూడా ఆచ్ఛాదించలేక పోయినవి.

అక్కడ మూగియున్న జనం సిగ్గుతో, జుగుప్సతో కళ్ళు మూసుకున్నారు. ఆ నగ్న దృశ్యం చూసేవరకు ఖాన్ కఠినత్వం కూడా కరిగిపోయింది. గ్లానితో ఉమ్మేసి "పరదా"ను వాకిట్లోకి విసిరివేసాడు. - కోపంతో, నిరాశతో తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు.

భయంతో కేకలు పెడుతూ చాటున దాక్కోడానికి పరుగులు పెడుతున్న స్త్రీలనుచూచి జాలిపడి ఆ గుంపు చెదరిపోయింది, చౌదరి స్పృహలేకుండా పడియున్నాడు. అతనికి స్పృహ వచ్చేవరకు 'పరదా' గడపలోపడి యున్నది - తిరిగి ఆ పరదాను గుమ్మానికి తగిలించే శక్తి అతనిలో మిగిలియున్నది. కాని, యిక 'పరదా' అవసరంలేదు. "పరదా ఏ భావనకు ఆలంబమో అది యిప్పుడు చచ్చిపోయింది."

---

# నేను నేనే

కచ్ఛపీ వీణావినోదిని నా హృదయరాగాన్ని
కచేరీలో ఆలాపించనని ముందే కబురు పెట్టింది
మహతీ గానలోలుడు మాటవరుసకైనా మాట్లాడడంలేదు
కాలసైకతం నా కాలి జాడలపై గోరీకూడా కట్టదట
బారలు చాచిన ఆకాశం ఈ ఘటాకాశాన్ని
నెత్తిన పెట్టుకోనని బాహాటంగా చాటింది
అనంతపథ సంచారి వాయుసోదరుడు
ఈ నిశ్వాసపు మూటను మోయనన్నాడు
జ్వాలా మాలికాధర వైశ్వానరుడు
ఈ జఠరాగ్ని పుష్పాన్ని వాసన చూడడట
మిడిసిపడే ఆకాశగంగ, అధోజగత్ వాసనాంబువుని
చప్పరించనని చాటిచెప్పింది
అనంతరేణు కింజల్కధారిణి-పృథ్వి
ఈ క్షేత్రరేణువుని తుంగలో త్రొక్కుతుందట
ఎవరితో మొరపెట్టేది? అయినా
ఈ జడ బధిర అంధ మూకులతోనా ముచ్చటించేది?
నేను నేనై యుండగా........

దే. శే. గిరి

---